


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



(గత సంచిక తరువాయి)

*మనం ఎంత ఆధునికమైనా చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. - సం.*

**అప్పుడు నాకు నా తెలివి** తక్కువతనం అర్థమయింది. రైల్వే ప్లాట్‌ఫారం మీద పోయిన సూట్‌కేసు పోలీసు కంప్లయింట్ వల్ల దొరుకుతుందా? - అందులోనూ ఇండియాలో!

మోసం, అన్యాయం దగా, అక్రమం, అవినీతి - అన్నింటికీ ఆలవాలం భారతదేశం - ఈదేశంలో పుట్టడం నాదురదృష్టం.

ఆకలితో పస్తులుండి మాడిమాడి చచ్చే దౌర్భాగ్యులున్న దేశమిది. అలాంటి దేశంలో ఆకలి బాధలేకుండా బ్రతకడమే ఒక పెద్ద అదృష్టం.

నాది అదృష్టమా - దురదృష్టమా?

సూట్‌కేసు పోవడంతో దేశం గురించి మళ్లా నా ఆలోచనలు. అంతలోనే అలా ఆలోచించే అర్హత నాకు లేదనిపించింది.

అన్నార్తుల గురించి పట్టించుకోను, అవినీతికి కారణాలాలోచించని నావంటి వాడికి - నా దేశంలోనే పుట్టి నా పక్కనే ఉంటూ నికృష్టజీవనం గడిపే అసంఖ్యాకుల్ని పట్టించుకోకుండా సుఖజీవనాన్ని గడిపే నావంటి వాడికి - దేశ పరిస్థితులు విశ్లేషించే అర్హత ఉండదు.

అందుకే నా ఆలోచనలను నాకు కలిగిన నష్టం మీదకు మళ్ళించాను.

రెండు కొత్తవి రెండు పాతవి - మొత్తం నాలుగు టెరీకాటన్ పాంట్లు, మూడు కొత్తవి, రెండు పాతవి - అయిదు షర్ట్సు, ఒక కాటన్‌పాంటు, ఒక దుప్పటి, ఒక కొత్త ఉలెన్ రగ్గు, రెండు లుంగీలు, రెండు తువ్వాళ్లు, రేజరు సెట్టు, బ్లేడ్సు, ఆకుజోళ్లు, రెండు సబ్బుబిళ్లలు, ఓ స్టెయిన్‌లెస్ స్టీలు సబ్బుపెట్టి, దువ్వెన, డైరీ, సైంటిఫిక్ లిటరేచర్ - ఇవన్నీ ఉన్న ఆ సూట్‌కేసు కూడా రవినుంచి ఎరువు తెచ్చుకున్నది. దానికో కాకీ కవరుకూడా ఉంది.

ఆర్థికంగా ఈ నష్టం నుంచి తేరుకుందుకు నేనెంత కష్టపడాలో!

తిరుగుప్రయాణంలో కలకత్తాలో ఒకరోజున్నాను.

కట్టుబట్టలతో ఇల్లు చేరిన నన్నుచూసి వదిన ఆశ్చర్యపోయింది. అన్నయ్య మాత్రం - "ఇదీ శుభసూచనే - శనిపోయింది" - అన్నాడు.

దారిలో ఎక్కడైనా అయిదుపైసలు దొరికితే లక్ష్మి రాకను సూచిస్తుందనుకుంటాము. వస్తువు దొరకడం శుభం. పోవడంకాదు. అదే నిజమైతే నేనా పెట్టెను కావాలనే పారేసుకోవచ్చు శనిని వదుల్చుకుందుకు!

వదిన నావాదనను ఖండిస్తూ - "నూరేళ్ళు పైబడ్డ ముసలాడికి కూడా ప్రాణాలమీద ఆశ చావదు. అందుకే భగవంతుడు మృత్యువును సృష్టించాడు. ఎవరికీ తెలియకుండా హఠాత్తుగా దొంగిలించుకు పోతుంది మృత్యువు. అది తెలిసే చూసి చూసి ఎవరూ ప్రాణాలు తీసుకోలేరు. అలాగే మనమనుకునే ఏ వస్తువునీ శని అని తెలిసీ పారేసుకోలేము. మనకు మంచిరోజులు కలిసి వచ్చినప్పుడు మన దగ్గరున్న శనిని తీసుకుని పోడానికి దేవుడు దొంగల్ని సృష్టించాడు -" అంది.

వేదాంతంలో గొప్ప సుఖముంది. భారతదేశంలో కూడూ గుడ్డా లేకపోయినా పాశ్చాత్య దేశీయులకు మించిన మనశ్శాంతి ఉండడానికి కారణమీ వేదాంతమే.

నా అదృష్టం - డబ్బు సూట్‌కేసులో కాక జేబులో ఉండడం. శని సూట్‌కేసులో మాత్రమే ఉండడం.

కలకత్తాలో వదిన సాయం తీసుకుని బజార్లో శ్రీమతి కోసం చీర, పిల్లలకు బటలు, రవికి తిరిగి ఇవ్వడానికలాంటిదే మరో సూట్‌కేసు, నాక్కూడా ఓ జత బట్టలు, రేజరు, తువ్వాలు వగైరా సామాన్లు కొన్నాను. డబ్బు చాలకపోతే అన్నయ్య దగ్గర తీసుకున్నాను.

ప్రయాణం కలకత్తాలో బ్రేక్ చేయడంవల్ల అన్నయ్య, వదినల అభిమానం, ఉపశమన వాక్యాలు నాకు లభించాయి. నాలోని నిరుత్సాహం తొలిగిపోవడమే కాక - కొత్త బలంకూడా చేరుకుంది.

భువనేశ్వర్ చేరుకున్నాక ఈ దొంగతనం విషయం లాబరేటరీలో నా బాస్‌కీ, రవికీ తప్ప మరెవ్వరికీ చెప్పలేదు. ఇతరులకు చెప్పవద్దని వారిద్దర్నీ కోరుకున్నాను. అదృష్టం గురించి తప్ప దురదృష్టం గురించి ప్రచారం చేసుకొనడం నాకిష్టముండదు. రవి మాత్రం నాకు పూర్తిగా వ్యతిరేకం. తన సూట్‌కేసు తీసుకొనడంవల్ల నా వస్తువులు పోయాయని అతడంటే నేను నొచ్చుకున్నాను.

నేను చేరుకున్న నాలుగు రోజులకు శ్రీమతి, పిల్లలు భువనేశ్వర్ వచ్చారు. ఆ నాలుగు రోజులూ నాలుగు యుగాల్లా గడిచాయి నాకు.

స్టేషన్లో నన్ను చూస్తూనే పిల్లలిద్దరూ నన్ను చుట్టేశారు. శ్రీమతి అలా చేయడానికి మొహమాటపడింది.

"వసూ! మనం ఒకర్ని విడిచి ఒకరుండలేము. ఈ సత్యం తెలుసుకుందుకే నేను సింధ్రీ వెళ్లానేమో!" అన్నాను.

"జర్మనీ విషయం తేలిందా?" అంది శ్రీమతి ఆత్రుతగా.

"ఇంకాలేదు. కానీ ఏ క్షణంలో ఫారిన్ అవకాశం వచ్చేస్తుందోనని భయంగా ఉంది -" అన్నాను.

"రాదని భయపడాలిగానీ - వస్తుందని భయమెందుకు?"

శ్రీమతి చెప్పింది నిజమే. అవకాశం వస్తే వెళ్ళడం, వెళ్ళకపోవడమన్నది నా యిష్టం. దానికి భయమెందుకు? రాకపోతే నాకెలాగూ ఛాయిస్ ఉండదు.

నేనేకాదు - చాలామంది ఇలా అర్థంలేని మాటలు మాట్లాడతారు.

సూట్‌కేసు పోయిన విషయం కలకత్తానుంచే శ్రీమతికి ఉత్తరం రాసేశాను. విషాద వార్తలను పెండింగులో ఉంచడం నాకిష్టముండదు.

శ్రీమతి తనకు నా ఉత్తరం అందినట్లు చెప్పి - "కుట్టించుకోక కుట్టించుకోక కొత్తబట్టలు కుట్టించుకున్నారు. అవి ధన్‌బాద్ దొంగల పాలయ్యాయి -" అని చాలా బాధపడింది.

ఇల్లు చేరాం.

శ్రీమతి నేను తనకు చీర తెచ్చానని ఆశ్చర్యపడింది. సాధారణంగా డబ్బు విషయంలో పొదుపరిని నేను. అలాంటిది ఇలాంటి క్లిష్టపరిస్థితిలో చీర కొనడం ఆమెకు ఆశ్చర్యమే! ఆమె ఆశ్చర్యంలో ఆనందంకూడా మిళితమై ఉన్నదని గ్రహించిన నేను - తరచుగా అటువంటి ఆనందాశ్చర్యాలకు ఆమెను గురిచేయగల ఆర్థిక శక్తి నాకివ్వమని అప్రయత్నంగానే భగవంతుణ్ణి ప్రార్థించుకున్నాను.

అప్పుడు తిండిలేని నా సాటి పౌరుడు నా ఊహల దరిదాపుల్లో లేడు.

"నాకు చీర బదులు - మీరే ఇంకో పాంటు గుడ్డ తీసుకోవాల్సింది -" అంది శ్రీమతి బాధగా.

మనం ఎదుటివాళ్ల సుఖసంతోషాల గురించి ఆలోచిస్తే - వాళ్లు మన గురించి త్యాగం చేసే స్థితికి వస్తారు. శ్రీమతి ఆ మాటలు హృదయపూర్వకంగా అన్నదని గ్రహించక నాకు కలిగిన భావమది.

ఆమె కలవారింట పుట్టింది. నా యింట్లో అడుగు పెట్టాక నేనామెను నా వాళ్లగురించి త్యాగానికి ప్రోత్సహించాను తప్ప - ఆమె కోసం నేను చేసిన త్యాగమంటూ ఏమీలేదు. ఇంతకాలం నాకామె ఈ విషయం చెప్పలేదు. ఇప్పుడూ చెప్పలేదు. నేను తెచ్చిన చీరను చూడగానే ఆమె కళ్లలో కనబడ్డ ఆనందాశ్చర్యాలు నాకీ విషయం చెప్పాయి.

"నాకింక పాంటుగుడ్డలెందుకు? జర్మనీ చలిదేశం. ఈ గుడ్డలక్కడి చలిని ఆపలేవు. ప్రయాణం ముందు ఓ జత ఉలెన్ బట్టలు కొనుక్కుంటే చాలు. తర్వాత ఆ దేశంలోనే అక్కడి వాతావరణానికి అనుకూలమైనవి కొనుక్కోవచ్చు" అన్నాను.

శ్రీమతి కళ్లు మెరిశాయి - "నిజ చెప్పండి. మీకు ఫెలోషిప్ వస్తుందని గట్టిగా నమ్ముతున్నారా, లేదా?"

"ఏం?" అన్నాను.

"మీరు గట్టిగా నమ్మితే ఏదైనా జరుగుతుందని నా నమ్మకం -"

"నాకు నమ్మకంగానే ఉంది మరి" అన్నాను. శ్రీమతి అక్కడితో ఆగలేదు. తన కుడి చేతిచూపుడు వేలినీ, మధ్యవేలినీ ఒకసారి ముక్కుకు తాకించి - "బాబీ - ఓ వేలు పట్టుకోరా -" అనడిగింది మా అబ్బాయిని. వాడో వేలుపట్టుకోగానే ఆమె ముఖం దివ్యతేజస్సుతో వెలిగింది.

నాకెదురైన అపశకునాలు, కొన్ని శుభశకునాలు, శ్రీ వెంకటేశ్వరస్వామి, నా గట్టినమ్మకం, మా అబ్బాయి పట్టుకున్న చూపుడువేలు - కలిసి ఏకమై దివ్యంగా పనిచేసి ఉగాది పండగకింకా మూడు రోజులున్నదనగా పశ్చిమ జర్మనీ వెళ్లడానికి ఎన్నికైన పన్నెండుగురిలో భూషణ్‌తో పాటు నేను కూడా ఉన్నానన్న విశేషం తెలిసింది.

నా చేతిలో ఫారిన్ రేఖ లేదన్న విషయం ఆ క్షణంలో నాకు గుర్తులేదు.

## 10

నేను సెలక్టయ్యానన్న చల్లని కబురు నాకందించినది రవి. ఎన్నో శుభవార్తలను నేనానోట విన్నాను. అసూయపడడం తెలియని అతి కొద్దిమంది విశిష్ట వ్యక్తులలో ఒకడైన రవి నాకీ వార్త అందిస్తున్నప్పుడు ఎంతో ఉత్సాహంగా ఉన్నాడు.

"మీకీ ఫెలోషిప్ రావాలని నేను చాలా కోరుకున్నాను. మీరైతే నాకు చనువు కాబట్టి నాక్కావలసిన స్టాంపులు తెప్పించుకోగలను -" అన్నాడతడు. అతడికి స్టాంపుల సేకరణ హాబీ.

నా ఫెలోషిప్ వార్త లాబరేటరీ అంతా పాకింది. వచ్చినవారికదో పెద్ద విశేషం. ఆఫీసుకది ఏటా జరిగే ఒక తంతు.

"మీరేమైనా అమ్మేసే మాటైతే నా చెవిన వేయండి -" అన్నాడు భాస్కర్. నాకులాగే అతడూ ప్రాక్టికల్ మనిషి.

జర్మనీ వెళ్లేముందు నేను క్వార్టర్ ఖాళీ చేయాలి. ఎలాగూ పదహారు నెలల్లో తిరిగే వచ్చే వాణ్ణే కాబట్టి సామాను భువనేశ్వర్నించి తరలించడం వీలుకాదు. ఎవరింట్లోనైనా దాచుకోవాలి, లేదా అమ్ముకోవాలి. మా ముందు - మా లాబొరేటరీనుంచి అయిదుగురు జర్మనీ వెళ్లారు. అందులో ముగ్గురు వెళ్లేముందు చాలా ఫర్నిచర్ అమ్మేసుకుని తిరిగి వచ్చాక మళ్లీ కొత్తవి కొనుక్కున్నారు. ఆ విషయం దృష్టిలో ఉంచుకునే భాస్కర్ నాకలా చెప్పాడు.

నేను, భూషణ్ ముందు మా బాస్ దగ్గరకు వెళ్లి ఆయన అభినందనలందుకున్నాం. తర్వాత డైరెక్టర్ అభినలందుకున్నాం. తర్వాత అడ్మినిస్ట్రేటివ్ విభాగానికి వెళ్లి ఏం చేయాలో విచారించాం.

మొదట మేము పాస్‌పోర్టు సంపాదించాలి. ఫెలోషిప్ పశ్చిమ జర్మనీ ప్రభుత్వం ఇస్తోంది కాబట్టి మాకు వీసా అవసరం లేదన్నారు.

అప్పటికి భువనేశ్వర్‌లో పాస్‌పోర్ట్ ఆఫీసు లేదు. మేము అప్లికేషన్ కలకత్తా పాస్‌పోర్ట్ ఆఫీసుకి పెట్టుకోవాలి. అందుకు ప్రత్యేకమైన ఫారాలు ఉన్నాయి. అవి అక్కడి ఆఫీసులోనే దొరుకుతాయి. లేదా పోస్టులో తెప్పించుకోవాలి.

నేను వెంటనే ఫారాల కోసం పాస్‌పోర్ట్ ఆఫీసుకీ, అన్నయ్యకూ కూడా ఉత్తరాలు రాశాను.

తర్వాత వచ్చిన ఉగాది నాకెంతో ఉత్సాహాన్నిచ్చింది. కానీ శ్రీమతి - "వచ్చే ఉగాదికి మనం విడివిడిగా ఉంటాం -" అనగానే నా ఉత్సాహం దిగులుగా మారిపోయింది. పెళ్లయ్యాక ఏ ఉగాదికీ మేము విడిగా ఉండలేదు.

"ఫెలోషిప్ రాకుండా ఉంటే బాగుండేదేమో!" అన్నాను.

"అలాగనకండి. మీ పేరు వెయిటింగ్ లిస్టులో వచ్చినప్పట్నించీ మీరు జర్మనీ వెళ్లిపోతున్నట్లే అటు స్నేహబృందంలోను, ఇటు బంధువర్గంలోనూ ప్రచారమైపోయింది. మీరు నిజంగా వెడితే - సంతోషించే వారెందరో తెలియదు. వెళ్లకపోతే ఆక్షేపించేవారు మాత్రం బోల్డుమంది. ఈ బాధ మీకంటే నాకే ఎక్కువ. మనం విడిపోవలసి వస్తే అది తాత్కాలికమేగదా! మీరు వెడుతున్నందుకు నాకిప్పుడెంతో గర్వంగా ఉంది -" అంది శ్రీమతి.

ఏదో అనబోయి ఆగిపోయాను. శ్రీమతిని కూడా జర్మనీ తీసుకుని వెళ్లాలన్నది నా కోరిక. ప్రస్తుతం. నా పరిస్థితుల్లో హఠాత్తుగా ఏదో మార్పువచ్చి అసాధ్యం సాధ్యం కావచ్చునని నా నమ్మకం. అయినా ముందుగా ఈ ఆశను శ్రీమతి ముందు కూడా బయట పెట్టదల్చుకోలేదు. ఎందుకంటే ముందుగా చెప్పి చేయలేకపోతే అది శ్రీమతికి ఆశాభంగాన్నీ, అవమానాన్నీ కలిగిస్తుంది.

"ఏదో అన్నాను కానీ - ఇలాంటి అవకాశం ఎంతమందికి వస్తుంది?" అన్నాను.

ఉగాది వెళ్ళిన మర్నాడు భూషణ్ నా దగ్గరకు వచ్చి - "పాస్‌పోర్టు ఆఫీసును నమ్ముకుంటే ఆ ఫారాలెప్పుడొస్తాయో తెలియదు. మనకున్న వ్యవధి తక్కువ. ఈరోజిప్పుడే మార్చి 25. జూన్ మొదటివారంలో మన ప్రయాణం. ఈలోగా చాలా తతంగాలున్నాయి. అన్నిటికీ పాస్‌పోర్టు పెద్ద ప్రతిబంధకమై పోతుంది. అది లేనిదే కథ ముందుకు వెళ్లదు -" అన్నాడు.

"అయితే ఏం చేద్దాం?"

"హోమ్ డిపార్టుమెంట్లో ఫారాలు దొరకవచ్చు. సెక్రటేరియట్‌కు వెడదాం -"

మా అదృష్టం బాగుండి భువనేశ్వర్లోనే మాకు ఫారాలు దొరికాయి.

ఇద్దరం అర్జంటుగా ఫోటోలు తీయించుకున్నాం.

పాస్‌పోర్టు సైజు ఫోటోలు చాలాసార్లు తీయించుకున్నాను కానీ పాస్‌పోర్టు కోసం తీయించుకొనడం ఇదే మొదటిసారి.

నా ఫోటో చాలా ఘోరంగా వచ్చింది. ఫోటో తీసేటప్పుడు నా కళ్ళు మూతపడ్డట్లున్నాయి. స్టూడియోవాడు ప్రింటులో అది దిద్దేసి తనకు తోచిన కళ్లు పెట్టేశాడు నాకు. చూస్తుంటే చాలాకాలం అంధత్వంలో బాధపడి - ఆపరేషన్ చేయించుకున్నాక కళ్లొచ్చిన వాడిలాగున్నాను నేను.

"ఈ కళ్లు మూలంగా మీరు మీరులా లేరండీ - మళ్లీ తీయించుకోకూడదూ..!? -" అంది శ్రీమతి.

"మళ్లీ అంటే ఈ భువనేశ్వర్లో నాలుగు రోజులు పడుతుంది. ఏవో ఒకటి చాల్లెద్దూ" అన్నాను కానీ నాలుగు రోజుల కోసం ఎంత ఘోరమైన తప్పు చేస్తున్నానో అప్పుడు నేనూహించలేదు.

పాస్‌పోర్టు అప్లికేషన్‌లోని విషయాలు నిజమేనని ఒక అండర్ సెక్రటరీ స్థాయి ఉద్యోగి సర్టిఫై చేయాలట. అది మా డైరెక్టరే చేయవచ్చునని తెలియడంతో మా సమస్య సులభంగానే పరిష్కారమయింది. ఏప్రిల్ నాల్గవ తేదీ నాటికి ఆయన సంతకాలయ్యాయి. అప్పటికింకా పాస్‌పోర్టు ఆఫీసు నుంచి మాకు అప్లికేషన్ ఫారాలు రాలేదు. ఫారాలకు ఆఫీసు మీద ఆధారపడకపోవడం మంచి పనే అనుకున్నాను.

ఏప్రిల్ నాల్గవ తేదీ గురువారం. గురువారం మధ్యాహ్నం బెంగాలీలకు చెడ్డదట. భూషణ్ అప్లికేషన్సు మర్నాడు పంపుదామన్నాడు. అతడికలాంటి సెంటిమెంట్సు ఉన్నందుకు నేనాశ్చర్యపడినా సరేనన్నాను. మర్నాడవి పోస్టయ్యాయి. అన్నయ్య కలకత్తాలో ఉండడం నా అదృష్టం. పాస్‌పోర్టు తొందరగా వచ్చే ఉపాయం చూడమని వాడికి ఉత్తరం రాశాను.

ఈలోగా ఇంట్లో సామానుగురించి ఆలోచించాం. బొమ్మలన్నీ ఒకరింట్లోనూ, పుస్తకాలన్నీ ఇంకొకరింట్లోనూ దాచాక - మిగతా సామానంతా రవి ఇంట్లో పెట్టాలనుకున్నాం. కొన్ని సామాన్లు అమ్మేశాం కూడా.

మా అబ్బాయికి దైవసాన్నిధ్యంలో పుట్టువెంట్రుకలు తీయించాలని శ్రీమతి అనుకున్నదట. గతంలో మేము తిరుపతి వెళ్లినపుడు మా అబ్బాయి బొత్తిగా నెలల పిల్లవాడు. నెత్తిమీద కత్తి పడడం మంచిది కాదన్నారు అందుకని అప్పుడు మూడుకత్తెరలు వేయించాం. ఇప్పుడూ మా అబ్బాయికి రెండేళ్లు నిండనున్నాయి. నేనుండగానే ఆ తంతు అయిపోవాలని శ్రీమతి మనసుపడడంతో పూరీ వెళ్లి శ్రీజగన్నాధుని సమక్షంలో ఆ తంతు కానిచ్చి వచ్చాం. ఇటువంటి తంతులు జరిగినపుడల్లా - నేను చదివిన సైన్సు నాపై చూపుతున్న ప్రభావమేమిటీ అన్న ఆలోచన నన్ను వేధించేది. విశ్వవిఖ్యాతి నార్జించిన శాస్త్రజ్ఞులు ఆదివారం చర్చికి వెళ్లగా లేనిది నేనిలాంటి తంతులకు లోబడడంలో తప్పేముందని సరిపెట్టుకున్నాను తప్ప ఆ విషయమై అప్పట్లో లోతుగా ఆలోచించలేదు

మేము మే ఒకటవ తేదీన బయల్దేరి ఇంటికి వెడదామనుకున్నాం. అంటే భార్యాబిడ్డలను దిగవిడచిరావడానికి.. మాతోపాటు రవి కుటుంబం కూడా వస్తున్నారు. వాళ్లకు ఎవరిదో బంధువుల పెళ్లి. రవి తనతోపాటు నా రిజర్వేషన్ కూడా చూసేశాడు.

ఇంటికి వెళ్ళేరోజు దగ్గరపడుతోంది. ఒకరోజు డాక్టర్ ప్రసాద్ ఇంటికి వెళ్లాం. ఆయన నాకు గురుతుల్యుడు. జర్మనీ నుంచి తిరిగి వచ్చి రెండున్నర సంవత్సరాలయిందాయనకు. తన జర్మనీ అనుభవాలు వివరించి చెప్పాక - "మీ అమ్మాయి బాగా పాడుతోంది కదా - ఈ ఈడులో ఆ పాట ముచ్చటగా ఉంటుంది. నేను మీకో కాసెట్ ఇస్తాను. దానిమీద మా యింట్లోనే రికార్డు చేసుకుని కూడా పట్టుకెళ్లండి. జర్మనీలో కొత్త కాసెట్ కొని నాకు తిరిగివ్వవచ్చు -" అన్నాడాయన. ఆ రోజు అమ్మాయి పాటతోపాటు అబ్బాయి మాటలు కూడా రికార్డు చేసుకున్నాను. కాసెట్ ఆయన వద్దనే వదిలి - "వినడానికి నా దగ్గర రికార్డరెలాగూ లేదు. జర్మనీ వెళ్లే ముందు తీసుకుంటాను -" అన్నాను.

ఆ మర్నాడు డాడ్ ఆఫీసు నుంచి ఉత్తరం వచ్చింది. అందులో స్కాలర్‌షిప్ గురించి వివరాలున్నాయి.

నా ప్రయాణం జూన్ 5న లుఫ్తాన్సా ఎయిర్ లైన్సులో. మొదటి నాలుగునెలలూ ల్యూనబర్గ్ అనే ఊళ్లో జర్మన్ భాష నేర్చుకోవాలి. ఈ నాలుగునెలలూ నాకు నెలకు మూడువందల మార్కులచొప్పున ఇస్తారు. (అప్పట్లో అనగా 1974లో మార్కు విలువ మూడు రూపాయలు) అక్టోబర్ ఒకటినుంచి ఒక సంవత్సరం పాటు బెర్లిన్లో నా రీసెర్చి కొనసాగుతుంది. ఈ కాలంలో నాకు నెలకు తొమ్మిది వందల మార్కులు ఇస్తారు. ఇవికాక వేరే బ్యాగేజి అలవెన్సనీ, పుస్తకాల అలవెన్సనీ, బట్టల అలవెన్సనీ వేరే ఉన్నాయి. వాటి ప్రాముఖ్యత అక్కడకు వెడితే కానీ తెలియదు నాకు. రూపాయల్లోకి మారిస్తే ఎక్కువగానే కనబడుతున్నా అక్కడి ధరల దృష్ట్యా ఇది చెప్పుకోతగ్గ మొత్తం కాదని కొందరన్నారు.

ఆ కాగితాలు చూడగానే శ్రీమతి దిగాలు పడిపోయి - "అక్టోబర్ ఒకటి - 1975 దాకా మనం విడిపోతున్నామన్న మాట - అంది.

"ఊ" అని -" ఉండవలసిన రోజుకొక్క క్షణం కూడా ఎక్కువుండను. నీ ముందు అక్టోబర్ ఒకటికల్లా వాలిపోతాను -" అన్నాను శ్రీమతితో. ఎందుకంటే సాధారణంగా ఇటువంటి అవకాశంపై విదేశాలు వెళ్లినవారు వైజ్ఞానికపరంగా ఆర్థికపరంగా ఉన్న లాభాలు దృష్టిలో ఉంచుకుని గడువుకాలం పెంచమని ఆఫీసును కోరుతూంటారు. నేనలా చేయకూడదనుకున్నాను. నా నిర్ణయంలోని బలం కాలమే నిర్ణయించాలి.

మా ప్రయాణమింకో రెండురోజులున్నదనగా అన్నయ్య దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఫోటోలు సరిగా లేక నా అప్లికేషన్ నిరాకరించబడిందట. ఫోటోలు పంపమని రాశాడు. అన్నయ్య కలకత్తాలో లేకపోతే నాకీ సమాచారం తెలిసేది కాదు. తను కనుక్కోకపోతే వాళ్లు ఆ అప్లికేషన్ మూల పడేసేవారని అన్నయ్య రాసింది చదవగానే నేను వణికిపోయాను. నా ప్రయాణానికెంతో ముఖ్యమైనది పాస్‌పోర్టు. అనుకున్న తేదీకది రెడీ కాకపోతే నా ప్రయాణమే కాన్సిలవుతుంది. ఇంత ముఖ్యమైన పాస్‌పోర్ట్ ఆఫీసులో ఎంతటి నిర్లక్ష్యం? అప్పటికి నా అప్లికేషనిచ్చి మూడు వారాలయింది. అయినా నాకేమీ తెలియబర్చలేదు వారు. అసలు ఫోటోలు అన్నయ్యద్వారా మార్చడానికి వాళ్లోపట్టాన అంగీకరించకపోగా - అన్నయ్య ఇన్ఫ్లుయన్స్ ఉపయోగించాల్సి వచ్చిందట.

నేను హడావుడిగా ఫోటో స్టూడియోకు వెళ్లి నా ఇబ్బంది చెప్పుకున్నాను. అతడు వెంటనే ఇస్తానని చెప్పి ఫోటో తీశాడు.

ఫారిన్‌ను స్వర్గంతో పోల్చే నేను అక్కడుండడానికి తగనా అన్న అనుమానం నాకప్పుడే కలిగింది. స్వర్గంలో ఉండే దేవతలను అనిమిషులు - అనగా రెప్పవేయని వారు - అంటారు. అక్కడికి వెళ్లాలనుకునే నేను కనీసం ఫోటోలో పడే క్షణంలో కూడా రెప్పవేయకుండా ఉండలేకపోయాను.

ఇరవైనాలుగ్గంటల్లో నా ఫోటో వచ్చింది. బాగుంది కూడా. అది అన్నయ్యకు పోస్టు చేశాను. అసలైన భయంకర వార్త అప్పుడు తెలిసింది.

మే ఎనిమిదవ తేదీనుంచి రైల్వే బొగ్గుపని వారందరూ సమ్మె చేయబోతున్నట్లు ప్రకటించారు. ఆ సమ్మెను నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని ప్రభుత్వం సంకల్పించి ముందు జాగ్రత్తగా ఇంధనం నిలవేయాలనుకుని - కొన్ని ట్రయిన్స్ కాన్సిల్ చేసింది. వాటిలో మా ప్రయాణానికి రిజర్వేషన్ జరిగిన హౌరా - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ కూడా ఉంది.

నేను, రవి కలిసి సమ్మె చేస్తామన్న రైల్వే పనివారలనూ, సమ్మెకు ముందే రైళ్లను ఆపివేసిన ప్రభుత్వాన్నీ తెగతిట్టుకున్నాం. విదేశాలు వెళ్లి వచ్చిన మా మిత్రులు - "ప్రభుత్వోద్యోగులు ప్రజలనింతలా వేధించడం పాశ్చాత్యదేశాల్లో జరుగదు"- అని చెప్పగా ఇలాంటి దేశంలో పుట్టినందుకు తెగ బాధపడ్డాను.

"ప్రభుత్వోద్యోగుల సంగతి సరే - ప్రభుత్వం చూడండి - సమ్మె నిజంగా జరుగుతుందోలేదో తెలియదు. కానీ దాని ప్రభావం అప్పుడే మనపై పడేలా చేసింది -" అన్నాడు రవి. అతడు వెళ్లవలసింది పెళ్లికి కాబట్టి ప్రయాణం వాయిదా వేసుకుందుకు లేదు. పూరీనుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులో ఎలాగో అప్పటికప్పుడు సీట్లు సంపాదించుకుని వెళ్లిపోయాడు.

నేను కొన్నాళ్లు వాయిదా వేసి చూశాను కానీ వృథా. రైళ్ల పరిస్థితి నానాటికీ మరీ అధ్వాన్నంగా తయారయింది. అప్పటికి హౌరా - మద్రాసు మెయిలొక్కటి మాత్రం తిరుగుతోంది. భువనేశ్వర్ రిజర్వేషన్ కౌంటర్ దగ్గర అవినీతి తక్కువ కాబట్టి అలాంటి పరిస్థితిలో కూడా నాలాంటివాడికి మెయిల్లో రిజర్వేషన్ దొరికింది.

ఈ సమ్మె చాలాకాలం కొనసాగేలా ఉందనీ, అందువల్ల భార్యాబిడ్డలను మాత్రమే పంపించి నేను భువనేశ్వర్లో ఉండిపోవడం మంచిదనీ శ్రేయోభిలాషులు నాకు సలహా ఇచ్చారు. కానీ వాళ్లనీ పరిస్థితుల్లో నేను లేకుండా ప్రయాణానికి పంపడం ఇష్టంలేక పోయింది నాకు. రానున్న ఇబ్బందులను కాలానికే విడిచిపెట్టి మెయిల్లో నేనూ, కుటుంబం ఇంటికి వెళ్లాలనుకున్నాను.

నా నిర్ణయం శ్రీమతికెంతో సంతోషాన్నిచ్చింది. హౌరా నుంచి వచ్చే మెయిల్ భువనేశ్వర్‌కు తెల్లవారురుఝామున వస్తుంది. ఊరికి బాగా ఓ చివర ఉంటున్న మేము ఇంటివద్ద తెల్లవారు ఝామున రెండుగంటలకు లేచి బయల్దేర వలసి వచ్చింది. అదృష్టమల్లా - ఉన్నదొక్కటే ట్రయిన్ అయినా - మెయిల్ ఆలస్యం కాలేదు.

రిజర్వేషనున్నప్పటికీ  మాకు మెయిల్లో ఎక్కడం చాలా కష్టమైపోయింది. ఎందరో జనం ప్లాట్‌ఫారం మీద ఎదురుచూస్తున్నారు. తిరుగుతున్నది ఒక్కటే ట్రయిన్. రిజర్వేషన్ గురించి ఎవరూ పట్టించుకోడం లేదు. అన్ని కంపార్టుమెంట్సూ మనుషులతో కూరుకుపోయి ఉండడంవల్ల నాకు సామాను ట్రయిన్లో కెక్కించడం చాలా కష్టమయింది. కొంత సామాను మా ఊళ్లో మా ఇంటి దగ్గర వదిలేయాలనుకున్నాం. అందువల్ల సామాను కాస్త ఎక్కువగానే ఉంది మాకు.

మాకు బెర్తులున్నాయి కాబట్టి కూర్చునేందుకు సీట్లున్నాయి. అయితే అదే కంపార్టుమెంట్లో రిజర్వేషన్ లేకుండా ఎక్కిన జనం చాలామందున్నారు. వాళ్లు కండక్టరుకి లంచాలిచ్చి ఎక్కిన బాపతు కాదు. కండక్టరు మానవత్వానికి చిహ్నంగా రైలెక్కినవాళ్లు. హౌరా నుంచి మద్రాసుకు వెళ్లే ఒకే ఒక్క ట్రయిన్లో ఎక్కడానికి - ప్రతి రైల్వే స్టేషన్లోనూ - ఒకో ట్రయినుకు సరిపడ్డ జనం ఉన్నారు.

నాకు ముందుగా ఒక బిడ్డతల్లి నిలబడి ఉంది. ఒకచేత్తో బెర్తును ఊతగా చేసుకుని నిలబడ్డ ఆమె రెండోచేత్తో బిడ్డను హృదయానికి హత్తుకుని అలాగే పాలు కుడుపుతోంది. ఆ దృశ్యం నాకు హృదయ విదారకంగా తోచి లేచి నిలబడి కూర్చోమని చెప్పాను. ఎంతో మొహమాటపడుతూ కూర్చున్నదామె.

రైల్వే పనివారల సమ్మె లేనప్పుడు కూడా ఆమె అలాగే ప్రయాణం చేసి ఉండేదని - ఆమెను చూడగానే తెలుస్తుంది. కానీ అప్పుడామెను నేను చూసి ఉండేవాణ్ణికాదు. సాధారణంగా జనరల్ కంపార్టుమెంట్లో నేను ప్రయాణం చేయను. రిజర్వేషన్ కంపార్టుమెంట్లో ఆమె ఎక్కలేదు.

అలాంటి మనుషులున్న ఈ దేశంలో సమ్మెలేమిటి?

అసలే సామాన్య ప్రజలు - నిత్యజీవితంలో ఎన్నో పోరాటాలు కొనసాగిస్తూ నానా అవస్థలూ పడుతూ - ఎన్నో సమస్యలకు సమాధాలు వెతుకుతూంటే - ఈ సమ్మెలు వారికి మరికొన్ని సమస్యలు సృష్టిస్తున్నాయి.

ఆ క్షణంలో సమ్మెలకు వ్యతిరేకంగా ఎన్నో భావాలు నాలో కలిగాయి. మనదేశంలో సమ్మెలు చేయడం అమానుషమనిపించింది.

రిజర్వేషనుండి కూడా నా అవస్థలూ పడి ఇల్లుచేరాం. కొద్దిరోజులు అత్తవారింట్లోనూ, కొద్దిరోజులు అమ్మా నాన్నల దగ్గరా ఉన్నాను.

మా అమ్మ నన్ను చూస్తూనే - "ఏరా ఈ వెధవ ఊళ్లో ఉండలేకపోతున్నాను. మీ నాన్నగారికి బొత్తిగా నా విలువ తెలీకుండా ఉంది. నన్నూ నీతోపాటు జర్మనీ తీసుకు పోకూడదూ -" అంది.

అమ్మ యథాలాపంగా ఆ మాటలంది. తనను జర్మనీ తీసుకుని వెళ్లడం ఎంత కష్టమో ఆమె ఊహించడానికి కూడా ప్రయత్నించలేదు. కానీ..

ఏమాత్రం వీలుపడినా నేను నా భార్యాబిడ్డలను జర్మనీ తీసుకుని వెళ్లాలనుకుంటున్నాను తప్ప - అమ్మ గురించి ఆలోచించనే లేదు. నా జీవితం నా భార్యాబిడ్డలకే పరిమితమైపోయింది. నా ఆలోచనలు వారిచుట్టూ మాత్రమే తిరుగుతున్నాయి. జన్మనిచ్చిన తల్లికూడా నా ఆలోచనల్లోకి రావడంలేదు. కానీ అమ్మ ఎంత గొప్పది.

ఎంతోదూరం నిలబడి రైల్లో ప్రయాణం చేస్తూ ఒకచేత్తో హృదయానికి బిడ్డను హత్తుకుని స్తన్యాన్నిస్తున్న ఆ తల్లి నా కళ్లముందు మెదిలి చలించిపోయాను.

ఈ ప్రపంచంలో తలెత్తుకుని మొనగాడిలా తిరుగుతున్న ప్రతి మనిషీ ఏదో ఒకరోజున ఆ విధంగా మాతృహృదయాన్ని బల్లిలా కరిచి పెట్టుకుని ఉన్నవాడే

అప్పుడే నాకు స్వార్థమంటే తెలిసింది.

అమ్మకు తన బిడ్డమీద మాత్రమే ప్రేమ. నాకు నా భార్యాబిడ్డల మీద మాత్రమే ప్రేమ. రైల్వే యూనియన్ నాయకులకు తమ తోటి ఉద్యోగులపైన మాత్రమే ప్రేమ.

సంకుచితమైన ఈ ప్రేమ సాటి మానవుణ్ణి నిర్లక్ష్యం చేస్తోంది. మనిషిని మనిషి దోచుకునేలా చేస్తోంది. లక్షలాది ప్రజలు అడుక్కుంటుంటే ఈ దేశంలో అక్రమ వ్యాపారం చేసేవాడూ, అయిదు రూపాయల జీతం పెరుగుదల కోసం సమ్మె చేసేవాడూ కూడా ప్రజలను దోచుకుంటున్నట్లే లెక్క.

మరి – విదేశాలు వెళ్లిరావడం!

తప్పని నాకనిపించలేదు.

నా ఖర్చులన్నీ ఒక సంపన్న దేశం భరిస్తోంది. నా శిక్షణ మన దేశానికి పనికివస్తుంది. ఈ విదేశయానం గురించి నేను సమ్మెలు చేయలేదు. ప్రజలకిబ్బంది కలిగించే ఏ పనీ చేయలేదు.

నా ఆలోచనలన్నీ శ్రీమతికి చెప్పాను.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments